
# మెట్లిబెల్లులు



శ్రీమతి వేమల సీతారామకృష్ణ

శ్రీలత కనిపిస్తుందని కల్లోకూడా అనుకోలేదు. కాని కనిపించింది. ఐదు సంవత్సరాల తర్వాత 'అబిడ్స్'లో ఆఫీసునుండి యింటికి నేను వెడుతుంటె, తను 'షాపింగు'కి వచ్చినట్లుంది. డ్రైవరి చేత ఏవో అట్టపెట్టెల 'పార్శిల్సు' కారు దగ్గరకు ఎట్టించుకువచ్చింది. నేను సరిగా అదే సమయాన ఆ కారు ముందు నుండి వెళుతున్నవాడిని. ఆమెను చూసి పలకరించకూడదనే అనుకున్నా, అయస్కాంతానికి లోబడ్డ యినుములా ముందుకు వెళ్ళలేక వెనుదిరిగాను. ప్రత్యేకించి శ్రీలత కోసమైతే నేనలా చెయ్యలేకపోయేవాడిని. కాని పాప బాబ్ హెయిరలో ఖరీదైన గౌనులో బొద్దుగా ముద్దులు మూటగట్టే నాలుగు సంవత్సరాల పాప శ్రీలత చెయ్యి బట్టుకుని పుత్తడి బొమ్మలా నడిచివస్తున్న పాప నన్ను అడుగు తీసి అడుగు వెయ్యనివ్వలేదు.

కార్లో కాలు బెట్టబోతున్న శ్రీలత ముందుకెళ్ళి నిలబడ్డాను. 'ఓ నువ్వా! రాము! బాగున్నావా' అంది యెంతో హుషారు కనబరుస్తున్నట్లు. బాగున్నా కనుకనే, నీకు మళ్ళీ కనుపించాను. నువ్వెలా వున్నావు మీ ఆయనకు యిక్కడ ఉద్యోగమా? ఏదో మొక్కుబడికోసం అడగాలి గనుక అన్నాను. నా దృష్టి అంతా పాపమీదే వుంది. అది గమనించినట్లుంది శ్రీలత. మా పాప బాగుందా అంత యిదిగా చూస్తున్నావు అంది.

తల్లి అలా అందని కాబోలు "ఎవరీయన మమ్మీ" అంది పాప. "ఎవరా! ఎవరో తర్వాత చెబుతాగాని నువ్వెళ్ళి కార్లో కూర్చో" అంది. వెంటనే డ్రైవరు డోరు తెరిచి పాపను 'బ్యాక్‌సీటు' లో కూర్చోబెట్టి మాకేసి కొంచెం వింతగా కళ్ళుపెట్టి చూశాడు. బహుశా నావంటివాడితో తమ యజమానురాలు మాట్లాడటం వాడికేమిటోలా అనిపించి వుండవచ్చు.

శ్రీలతకేసి ఎరిగిలినగా చూశాను. ఐదేళ్ళ ముందుకీ, యిప్పటికీ యేమంత తేడాలేదు. అదే నొక్కులజుట్టు, మొఖంలో అదే దర్జా, కళ్ళలో అదే కాంతి. కాదంటే అప్పుడు లతలా సన్నగా వంపులు తిరిగి మరీ నాజూకుగా వుండేది. ఇప్పుడు కొత్త వళ్ళుచేసి, పసిమిరంగులో ఖరీదైన చీరలో పసిడిబొమ్మలా వుంది. మరినేనో. కొంచెం మాసిన గెడ్డం, లూజుగా అక్కడక్కడ చిరిగితే "రఫ్" తీయబడ్డ పాంటు, మామూలుగా దేవుడిచ్చిన అందం వున్నా. అది కాపాడుకుందుకు శ్రీలతలా ఖరీదైన వస్తువులు లేకపోయినా కనీసంగాకూడా లేక చూపరులదృష్టిలో బికారిలా నేను. నేనలా ఆలోచిస్తూ నిలబడిపోయానని కాబోలు .."మరి నేను వెడతాను రాము. ఎప్పుడైనా మా యింటికి రా. చిక్కడపల్లిలో వెంకటేశ్వరుడి "టెంపులు" వుంది చూడు. ఆ ఎదురుగానే మా బంగళా. డాక్టర్ సురేష్ అనివుంటుంది మావారి "నేమ్ బోర్డు" అనేసి మరి నేనేమీ అనకుండానే వెళ్ళి కారులో కూర్చోవడం, కదలడం ఒకేసారి జరిగేయి. నన్నని తారరోడ్డుమీద జర్రున జారిపోతున్న ఆ "ఇంపాలా" కారు. అందులో కూర్చున్న ఖరీదైన మనుష్యులను కనబడనంత వరకూ చూసి నవ్వుకున్నాను.

పిచ్చివాడిననుకున్నారు కాబోలు, ఒకరిద్దరు నాకేసి సానుభూతిగా చూసి పాపం అనుకుంటూ పోతున్నారు. నేను పిచ్చివాడిని కాదండి యిప్పటి వరకూ యిక్కడ ఆగింది చూశారా, సిల్కు కర్టెన్లు వున్న కారు. ఆ కార్లో ఆవిడ అతి తెలివితేటలను చూసి పాపం అని నవ్వుకుంటున్నా అని యెలుగెత్తి అరవాలనుకున్నా. కాని వాళ్ళు నా గోడు వినేందుకు ఆగుతారా? ఆగరు. శ్రీలత ఆగిందా? కనీసం గతంలో మా యిద్దరికీ మధ్యనున్న అవినాభావ సంబంధాన్ని ఒక్కసారిమననం చేసుకునే మనసు వుంటే, అలా మహారాణిలా, నిర్లక్ష్యంగా వెళ్ళగలదా? ఏమిటో!... నా పిచ్చి. ఆయనే వుంటె నాకు యీ అకు ఖర్మేమిటన్నట్లు శ్రీలతకా దర్పమే లేనినాడు, నేను యీ రోడ్డుమీద నడవక పోయేవాడిని.

గతావలోకనంలోకి నా అంతరాత్మ ఆరాటంగా జారిపడింది అప్పుడు శ్రీలతవాళ్ళ నాన్నగారు భీమవరంలో వుండేవారు. ఆ వూరికి పెద్ద పేరు, పలుకుబడి వున్న లాయరు ఆయన. పెద్ద మేడలో కాపురం వాళ్ళకు శ్రీలత ఒక్కతే కూతురు. కాలేజీలో చదివేది. ఇవన్నీ నాకెలా తెలుసంటే. నేను అప్పుడు వాళ్ళ మేడమెట్లకింద వున్న గది లాంటిది వుంటే, వేరేచోట అద్దె ఎక్కువగా యిచ్చుకోలేక అందులో పదిరూపాయలకు వుండేవాడిని. అసలు ఆ పదిరూపాయలేనా యిచ్చుకునేందుకు బరువుగానే వుండేది. అందుకు కారణాలు చాలా వున్నాయి. బి ఎ ప్యాసైన నాకు, లంచాలిచ్చుకుని వుద్యోగాలు కొనుక్కునే స్తోమత లేక రికమండేషను చేసే మినిష్టర్లులేక యేన్నో పాట్లు పడగా, పడగా నూట పాతికరూపాయల గుమాస్తా వుద్యోగం రావడం గగనమయినది. అందులోనే తల్లికి, పెళ్ళి కావలసిన చెల్లెలుకి పంపించాలి. నేను తినాలి. ఇంకా నయం, తా దూర సందు లేదు, మెడకో డోలు అని పెళ్ళికూడా చేసుకుంటే దాన్నికూడా పోషించవలసి వచ్చేది. అంత పిచ్చిపని అప్పట్లో చేసుకోవడం యిష్టంలేక యవ్వనంలో పరుగెత్తే గుర్రాలవంటి కోర్కెలకు కళ్ళాలు వేసి కాలం గడుపుతున్నాను. ఔను మరి. తండ్రి మిగిల్చిపోయిన ఆస్తిపాస్తులు యేమీలేని నావంటి తనయులు అంతంటే అత్యాశకు పోయినా ప్రయోజనం శూన్యమే మరి.

అలా నేనున్న స్థితిని నిమిష నిమిషానికి గుర్తుచేసుకుంటూ, చివరకు శ్రీలత విసిరిన వలపు పగ్గాల్లో కట్టుపడక తప్పిందికాదు నాకు. శ్రీలత నుండి యెంత తప్పించుకోవాలని చూసినా సాధ్యం కాలేదు. తలిదండ్రులకు తెలియకుండా చాటుగా అర్థరాత్రులు నా గదిలోకి వచ్చేది. నిన్ను నేను ప్రేమించాను అనేది. నీ తోటిదే నా లోకం అనేది

(మిగతా 45 వ పేజీలో)

# "నన్ను నేను - చంపుకుంటున్నాను"

మానవతలోని మహత్తును సాధించినందుకు
మనుజునికి స్వాతంత్ర్యాన్ని బోధించినందుకు
సోక్రటీసును విషం ఇచ్చి చంపించినప్పుడు
"నన్ను నేను చంపుకున్నాను", అనిపించింది నాకు!

"వీరేంచేస్తున్నారో వీరికి తెలియదు
వీరిని క్షమించు ప్రభూ" అంటున్న క్రీస్తును
తిన్నగా సిలువపైకి ఎక్కించినప్పుడూ
"నన్ను నేను చంపుకున్నాను" అనిపించిందినాకు!

నరుల్లో నారాయణుని వంటి గాంధీని
నాథూరాం గాడ్సే హతమార్చినప్పుడూ
"నన్ను నేను చంపుకున్నాను" అనిపించింది నాకు!

హనాయిలో ఆసుపత్రి భవనంమీద
అమెరికన్ విమానాలు బాంబులు విసరగా
అమాయికులైన రోగులూ, నర్సులూ, డాక్టర్లూ
మరణించినప్పుడు
"నన్ను నేను చంపుకున్నాను" అనిపించింది నాకు!

బలిసిన దుర్మదంచేస్తున్న ప్రతిఘాతుకచర్యకూ
బక్కచిక్కిన నిజాయితీ తనం బలి అయిపోతున్నప్పుడు
"నన్ను నేను చంపుకుంటున్నాను" అనిపించుతుంది నాకు!

— పాతూరి ప్రసన్నం

# మట్టి బెల్లులు

(24 వ పేజీ తరువాయి)

యవ్వనంలో పున్న శ్రీలత. ముగ్ధసుకోమలమైన శ్రీలత. ఎత్తుపల్లాల మీద వంపులు తిరుగుతూ పాగిన లతవంటి శ్రీలత. రేకులు విచ్చిన రోజా పుష్పంవంటి శ్రీలత, కోరి నా దగ్గరకు వస్తే కాదని యెలా అనేది? అల్లాగని దొరికిందే సందుగా శ్రీలత శీలాన్ని దోచుకునేంత విచక్షణాశూన్యుడను కాలేక ప్రేమించాననడం చాలా తేలిక. కాని ఆ ప్రేమ జీవితకాలం వరకు కలిసివుండే బంధానికి అర్హమైనదేనా ఆలోచించుకో. నేను పేదవాణ్ణి. నువ్వాస్తిమంతురాలవు. తాత్కాలికమైన వుద్రేకంలో కలిగినమాటలు కలకాలం కాపరంచెయ్యవు. ఎన్నో వుపదేశాలు చేశాను. అటువంటి సందేహాలు, ఆలోచనలు అనవసరం. నేను ప్రేమించింది నీ పేదతనాన్ని కాదు. నేను తల్లిదండ్రులకు ఒక్కతెనే. నీకూ తెలుసుగా. మా యింట్లో నన్నెంతో గారాబంగా చూసుకుంటారు. నిన్ను నేను పెళ్ళి చేసుకుంటానంటే మా వాళ్ళు అభ్యంతరం పెట్టరు. సందేహించకు రాము. పెళ్ళైతే నాకున్న ఆస్తి నీది కాదా. సినిమాలో డైలాగ్సులా చదివేసింది.

కలవాళ్ళ కబుర్లన్నీ యిలాగే వుంటాయి. ముందు మీ పెద్దవాళ్ళకు యీ విషయం తెల్పి, వివాహం జరిగేవరకూ మనం తొందరపడ్డం నీకూ, నాకూ కూడా మంచిది కాదని సున్నితంగా శ్రీలతకు నచ్చజెప్ప చూశాను. ప్రేమకు పెళ్ళి అడ్డువస్తుందా రాము! వెనకో ముందో మన పెళ్ళి జరగడం ఖాయం. అంత నమ్మకంగా శ్రీలత అంటుంటే, అంతవరకూ అట్టడుగున యెక్కడో మన్నుతిన్న పాములా పడివున్న కోర్కెలు, కోడెనాగులా తలెత్తాయి నాలో. పేదవానికి పెన్నిధి దొరికినట్లు సంబరపడుతూ శ్రీలతను నా హృదయకుహరంలో కుటీరం వేసి అందులో స్థాపించుకున్నాను. ఆమె నా కంటికొక దేవతగా, నన్ను వుద్ధరించడానికి వచ్చిన త్యాగమయిలా వూహించుకున్నాను. ఆకాశంలో ఆశల హర్మ్యాలు నిర్మించుకున్నాను. అందులో శ్రీలత నేను కాపురం చేస్తున్నట్లు, మా ముందు నందనవనమే వచ్చి నిలిచినట్లు, అందులో విహరిస్తూ మేము స్వర్గ సౌఖ్యాలను అనుభవిస్తూ హాయిగా మా మధ్యకు ఒక బుచ్చి పాపాయిని కూడా తెచ్చుకున్నట్లు కలలు కన్నాను. నిజంగానే అవి కలలుగానే మిగిలిపోతాయని తెలిసివుంటే నేనసలు శ్రీలత నీడనే పడనిచ్చేవాడిని కాదు. ఉన్నట్లుండి శ్రీలత నా దగ్గరకు రావడం మానేసింది. ఎప్పుడేనా కనబడినా ముఖం చాటు చేసుకునేది. ఆమె ప్రవర్తనకు కారణం యెంత ఆలోచించినా అంతుపట్టలేదు.

విషయమేమిటో కనుక్కోవాలని. మా యిద్దరి విషయం వాళ్ళ నాన్నగారితో చెబుదామని మేడ మీదకు వెళ్ళాను. వెళ్ళేసరికి లోపల సంభాషణ నా మీదే జరుగుతోంది. లతా! నీకేమీ మతిపోలేదుగదా. ఆ దరిద్రుణ్ణి చేసుకుని యేం సుఖపడతావు? సుఖంమాట తర్వాత నాన్నా. ముందు ఆయన రూపం నాలో... నిజమేనా, యెంతపని చేశావు లతా! ఒక్క పిల్లవని స్వేచ్ఛ యిచ్చినందుకు, యిలాగేనా ప్రవర్తించేది? పోనీలే. ఈ విషయం యెవరితోనూ అనవద్దు. తొందరలో మంచి వరుణ్ణి చూసి పెళ్ళి చేస్తా. మరొకరితోనా నా పెళ్ళి ... వద్దు నాన్నా! రాముని నేను మనసారా ప్రేమించాను. అతన్నే చేసుకుంటా. పిచ్చి పిల్లా! పూటకు ఠికాణాలేనివాడిని కట్టుకొని, కష్టాలు కొనితెచ్చుకుంటావా? అంతగా నా మాట కాదని వాడినే చేసుకుంటే, ఆస్తి నయాపైసా కూడా నీకు దక్కదు. జోగి జోగి రాసుకుంటే బూడిద రాలిందని, ఒకరి మొఖం ఒకరు చూసుకుంటూ చూసుకుంటూ కడుపులో కాళ్ళుపెట్టుకుని పడుకోవాలి. ఆ పైన వారి సంభాషణకు అడ్డు కలిగిస్తూ రంగంలోకి ప్రవేశించాను. నన్ను చూసి శ్రీలత, తల్లి లోపల కెళ్ళారు. ఆయన సోఫాలో కాలుమీద కాలు వేసుక్కూర్చొని, విలాసంగా సిగరెట్టు కాలుస్తూ నన్ను ఓ పురుగును చూసినట్లు చూస్తూ...నిన్నెవరు రమ్మన్నా రిక్కడికు! అన్నారు.

మీవంటివారు, నావంటి వాడిని ఆహ్వానించారని తెలిసి, నాకై నేనే వచ్చాను. బహుశా నేనెందుకు వచ్చేనో. మీరు గుర్తించేవుంటారు. మీరు అన్నట్లు శ్రీలత, నేనూ పెళ్ళి చేసుకుంటే బూడిద రాల్చుకోనక్కరలేదు. బాగానే బ్రతగగలం అన్నాను. మా మాటలన్నీ, నువ్వు విన్నావా అన్నారు మళ్ళీతనే...విన్నా, నాకు భయం లేదు. నువ్వు మమ్మల్నేం చెయ్యలేవు. మా అమ్మాయికీ, నీకూ సంబంధం లేదు.

ఔను. మీరు గొప్పవాళ్ళు. పున్న సంబంధాన్ని యెవరికీ తెలియకుండా నాల్గు గోడల మధ్య సమాధి చెయ్యగల సమర్థులు. కాని మీ అమ్మాయిని. నాకు కాకుండా చేసినా, నా రూపం ఆమెలో ప్రాణం పోసుకుంటోంది. ఆ బంధాన్ని విడదీస్తే ఆ ఉసురు తప్పకుండా మీకు తగిలితీరుతుంది అన్నా.

అనవసరంగా వాగేవంటే, పర్యవసానం మరోలా వుంటుంది. అన్నారు. యెలాగేనా వుండనివ్వండి, మీ అమ్మాయి చెడిపోయిందని లోకం అందరికీ చాటి చెబుతాను. యెలా పెళ్ళి అవుతుందో చూద్దురుగాని అనేసి వెళ్ళబోయాను. మళ్ళీ శ్రీలతను కూడా ముఖాముఖీ అడిగేస్తే మంచిదని మీ అమ్మాయిని ఒకసారి పిలిపిం

చండి అన్నాను. "అమ్మాయ్" అని కేకేసి నేనిందాకా చెప్పింది గుర్తుందా? ఆలోచించుకుని బ్రతుకు బాటలో పల్లేరు కాయలే పరచుకుంటావో, పరిమళ పుష్పాలే జల్లుకుంటావో చెప్పు వాడికి అన్నారు. శ్రీలత తప్పకుండా తండ్రినే బెదిరిస్తుంది. ఎందుకంటే చదువుకుంటున్న పిల్ల సంస్కార విహీనంగా, నాతో వున్న సంపర్కాన్ని తెంపుకోదు. అనుకొంటూ శ్రీలతకేసి ఆశగా చూశాను. నేను వేరేది చెప్పేదిలేదు. రామూ, నాన్నగారు చెప్పారుగా! అదే నా నిర్ణయం అనేసి శ్రీలత లోపలకు వెళ్ళిపోయింది. వాళ్ళ నాన్నగారు భళ్ళున నవ్వారు. విన్నావా? అది... నా కూతురు...అన్నట్లు గర్వంగా చూశారు.

శ్రీలత యెంత నయవంచకురాలో అర్థమైనది. మగవాడంటే ఆటబొమ్మ అనుకుంది కాబోలు, అనుభవించి వదిలెయ్యడానికి నాలో ద్వేషం పేరుకుంది. హృదయం వంకాయలా ఉడికి పోయింది. సరే! చూస్తాను...మీ బ్రతుకులు బజారున పడవెయ్యకపోతే అడగండి అన్నాను. విసవిసా వెళ్ళిపోతూ. వెనకనుండి ఆయన ఎవరి బ్రతుకు బజారున పడుతుందో త్వరలోనే తెలుస్తుంది. వెళ్ళవోయ్ వెంగళప్పా అనడం వినబడింది. పేదవానికోపం పెదవికి చేటు అయన యెదురుగా దప్పాలయితే కొట్టానుగాని, యెవరితో చెప్పను. అంతగాచెప్పినా! ఆయన గురించి మాకు తెలియదా? అని నన్నే కసురుకుంటారు. ఆ ఊళ్ళోవాళ్ళకు ఆయన యందున్న భక్తి విశ్వాసాలు, నమ్మకాలు అలాంటివి. అది ఆయన గొప్ప కాదు. తేనెలొలుకు ఆయన మాటల్లోని నాటకం. ఆయన చేతిలో ఉన్న అధికార మదం. ఆయన పెట్టెలో పడి మూలుతున్న పచ్చ నోట్ల ప్రభావం. ఆ ప్రభావంతోనే మూడో నాటికి నా ఉద్యోగం తీయించి మా వోటి దగ్గర దూడు పడగొట్టాడు. పైగా నన్ను పలకరించి మీసాలు సవరించుకుంటూ హేళన మిళితమైన కంఠ స్వరంతో. అర్హతలేని వాళ్ళంతాఅందలం యెక్కాలని చూసే ఫలితం యిలాగే వుంటుంది. పిల్లి కాకిమీద, ఉండేలు దెబ్బయెందుకని, నయాన నచ్చచెప్పకపోతే, నా బ్రతుకు బజారునపడ వేస్తానని బెదిరిస్తావా? "స్కౌండ్రల్! వెళ్ళునీదిక్కున్న చోట చెప్పుకోమన్నారు. పేదవాళ్ళ కడుపులు కొట్టడం తప్ప మీ గొప్పవాళ్ళు చేసే ఘనకార్యాలు యేముంటాయి. పెద్దవాటినే చంద్రమండలానికి వెళ్ళి వచ్చినంత గొప్పగా చెప్పుకుని ప్రజలచేత బ్రహ్మ రథం పట్టించుకుంటారు వెళ్ళండి ఒక అనామకుడు అహర్నిశలూ శ్రమించి సంపాదించుకున్న వుద్యోగాన్ని నిమిషంలో నేను వూడలాగేనని వూరంతా సంతోషంగా చాటింపు వేసుకోండి. అరిచేడు. జుట్టు చేత్తో పీక్కుంటూ.

ఆయన ముందు నేనంత బాధపడుతున్నట్లు కన బడకూడదనే అనుకున్నాను. కాని నేను వున్న స్థితి నా తల్లి చెల్లెలు దైన్యత నిండిన వదనాలు నా కంటిముందు కదిలి మమ్మల్నేం చెయ్యదల్చుకున్నావని, నిలదీసి అడిగినట్లనిపించింది. నాలోని మార్పును ఆయన మనసారా చూస్తూ... ఆ మరో ఘనకార్యం ఏమిటంటే ... మళ్ళీవారం, యిదేరోజున మా యింట్లో శుభకార్యం జరుగబోతుంది. మా అమ్మాయి పెళ్ళి. కాబోయేఅల్లుడు 'ఫారిన్ రిటర్న్' డాక్టరు సురేష్. యాభై వేలు కట్నం. మువ్వారోజు మా యింటికి ఆకులు తీసి పారెయ్యడానికి రా. ఓయ్ వినపడిందా. మరి వస్తానని అంగలేసుకుంటూ వెళ్ళారాయన.

ధనంబురఖా కప్పుకున్న ఆ పెద్దమనిషి ఆ మాటలు చాలా తేలికగా అనగలిగారు. నాకవి యీటెల్లా తగిలాయి. వెంటనే యిల్లు ఖాళీచేసి వెళ్ళిపోవాలనుకున్నా. కాని... అసలే వ్యాకులతగా వున్న మనసు. అంత వెంటనే అమ్మా, వాళ్ళను చూడటానికిష్టపడలేదు.


ఒకరోజు తిన్నట్లు, ఒకరోజు తిననట్లు తిని, భయంకరమైన భవిష్యత్తును తల్చుకుంటూ తలుపులేసుకుని ఆ గదిలోనే గడిపేవాడిని. శ్రీలత పెళ్ళిరోజు వచ్చింది. మంచి ఆట్ట హాసంగానే యేర్పాట్లు జరుగుతున్నాయి. ఆ వీధి వీధంతా 'చాందిని'తో పందిర అలంకరించారు. దానికి కాగితంపూలు, రబ్బరు బెలూన్లతో డెక రేషన్ చేసి కన్నులు మిరుమిట్లు గొలిపేలా 'లైటింగు' అరేంజి చేశారు. పెళ్ళి ఘడియ ఆసన్నమవుతున్నకొద్దీ, కార్లు, ఆటోరిక్షాలు. మోటారుసైకిళ్ళమీద జనం తండోప తండాలుగా వస్తున్నారు. రకరకాలుగా వున్నారా మనుష్యులు అలాగే అలంకరించుకున్నారు.

ఎత్తుముడి వేసుకున్న యింతులు, ఎత్తుమడమ జోళ్ళువేసుకున్న అమ్మాయిలు, మెలితిప్పిన మీసా లున్న ప్రబుద్ధులు, అసలు మీసాల్లేని బుద్ధా యిలు అందులోనే కొందరు హిప్పీలు...బహుశా వాళ్ల మగపెళ్ళివారయి వుంటారు. గదిలో వున్న నాకివన్నీ యెలా కనబడ్డాయన్న సందేహం యెవరి కైనా రావచ్చు. ఎంతటితప్పునైనా కప్పిపుచ్చగల ఆ ఖరీదైన మనుష్యులను కళ్ళతో చూడాలని కుతూహలంతో, దొడ్డితలుపు (అదినాడకంలోలేదు) సందుల్లోంచి చూశాను. శ్రీలత సిగ్గుపడి పోతున్నట్లు వంగివంగి నడుస్తూ హొయ లొలికిస్తూ, ముత్తయిదువుల మధ్యనుంచి వచ్చి పీటలమీద కూర్చుంది. శ్రీలతా! నువ్వెం తటి దానవు? కోర్కె తీర్చుకొనే వరకు నీ బావ లతో నన్ను మభ్యపెట్టి నీ బానిసగాచేసుకున్నావు. ఈనాడు నేను ఎవరినో నీకక్కరలేదు. కనీసం నీ కడుపులో పాప కదిలినప్పుడేనా నేను నీకు గుర్తు రాకపోతానా ఏమో! అలా అనుకుందుక్కూడా అవకాశంలేదు. ఆడమనస్సు అంతు తెలియని సముద్రం వంటిదంటారు. అందులో ఒక యిసుక రేణువువంటి వాడిని నేను. నన్ను నీవు మర్చిపోవడంలో ఆశ్చర్యంలేదు. అది ఆడలక్షణం, కసిగా పళ్ళు కొరుక్కున్నాను. పెళ్ళి జరిగిపోయింది. దీర్ఘంగా నిట్టూర్చాను. మర్నాడే మా వూరు వెళ్ళిపోయాను.

"గతావలోకనంలో వున్న నేను రోడ్డుకు మధ్యగా నడుస్తున్నది కూడా గమనించలేదు. ఏయ్! పక్కకు తప్పుకో ప్రాణాలమీద ఆశలేదా! వెనకాముందు చూసి నడవక్కరలే అని కారులో అతను కసురుతున్నాడు నన్ను. అవును. నేల మీద నడిచే వాళ్ళు ఊహల్లో వూగితే యెలా. అది కార్లలో వాళ్ళకే పరిమితం కాబోలు, శ్రీలతను నేను నమ్మి మోసపోయినట్లే అనుకొని పక్కకు తప్పుకున్నాను.

నడుస్తున్నానన్నమాటేగాని ముద్దులమూటగట్టే పాప వదనమే నా కళ్ళకు కట్టినట్లుంది. ఆ పాప, నా పాప గనుకనే నన్నంత ఆకర్షించింది. పోలి కలుకూడా నావే. సందేహంలేదు. మనస్సు నమ్మ కంగా పలికింది. అదీకాక. పాప నన్ను యెవ రమ్మా అని అడిగినప్పుడు శ్రీలత మాట తప్పించి తర్వాత చెప్తాలే అంది. అంటే నిస్సందేహంగా పాపకు నేనే తండ్రిని. ఏమైనా ఒకసారి శ్రీలత యింటికి వెళ్ళి, ఆ విషయం తేల్చుకోవాలి. తేల్చుకుని నేను చెయ్యగలిగిందేదీ లేదు. బినా అదో తృప్తి. లోకానికి బ్రహ్మచారినైనా నాకు పాపా. నవ్వేతున్నాను మళ్ళీ ఒక సందేహం వచ్చింది. వెడితే శ్రీలత యేమైనా అనుకుంటుం దేమో. యిష్టతోనో. అయిష్టతోనో. శ్రీలత ఆహ్వానించిందిగా. వెడితేనేం. అక్షేపణేమిటి? అంతరాత్మ భరోసా యిచ్చింది.

ఒక రోజు సాయంత్రం వెళ్ళడానికి నిశ్చ యించుకొని, ముందుగా 'షాపింగు'కు వెళ్ళి పాపకు కీయిస్తే తిరిగే బొమ్మ, చాక్లెట్లు, బిస్కట్లు, కొని తీసికెళ్ళాను. రెండంతస్తుల మేడ అది. యెదర ఖాళీ స్థలంలో రకరకాల పూలతో విరబూసిన చెట్లు. వాటి మధ్యన కూర్చుండుకు సిమెంటు బెంచీలు, పాలరాతితో మలిచిన రాధా కృష్ణ విగ్రహం,ఫౌంటెన్లో నుండి నీళ్ళు జల్లుగా



ఆ విగ్రహాల మీదకు పడుతూ చూట్టానికి చాలా బ్యూటీగా వుంది. డబ్బు వుంటే యెన్ని సరదాలేనా తీర్చుకోవచ్చు. నాకు నేనే సమాధానం చెప్పుకున్నాను. నన్ను చూసి గుమ్మంలో వున్న అల్సేషను కుక్క అరిచింది. ఆ అరుపు విని కాబోలు, ఆ యింటి యజమానురాలు, అదే శ్రీలత బైటకు వచ్చింది. గోపురంలా ముడి చుట్టుకుంది. ఒక తెల్ల గులాబీ చెవిపక్కకు పెట్టుకుంది. పాలమీగడవంటి చీర...అదే స్లీవ్ లెస్ బ్లౌజు. చెవులకు తెల్లపూసలతో వున్న పెద్ద పెద్ద రింగులు. మెడలోని ముత్యాల హారం, గుమ్మంలో అజంతా సుందరిలా నిలబడి రామూ, నువ్వా! యెవరో అనుకున్నా రా లోపలకు అంది తను లోపలకు వెళ్ళి సోఫాలో కూర్చుంటూ.

అవును, నేనే, నావంటి వారెవరూ మీ ఇంటికి రారేమో, అంతా కార్లలో ఖరీదైన సూట్లు వేసుకొని. బూట్లు టకటక లాడించుకుంటూ వస్తారు. అవునా అన్నాను శ్రీలత కెదురుగా వున్న సోఫాలో కూర్చుంటూ. ఉహూ, అదికాదు. యేదో మాట వరస కన్నదానికి, నువ్వు వస్తావని అనుకోలేదు అంది. నువ్వు రమ్మనక పోయినా, నేను వచ్చేవాడినే పాపకోసం. పడగ విప్పిన త్రాచులా చూసింది శ్రీలత నేనన్నదానికి. నేనదేమీ పట్టించుకోక, పాప యేదీ అన్నాను, చేతిలోవున్న వస్తువులు పక్కనేవున్న టేబుల్ మీద పెడుతూ. యేమిటవి: అంది కాఠిన్యంగా. యేమున్నాయి! చంద్రుడికో నూలుపోగు. పాపకోసం తీసుకు వచ్చాను. ఆడుకుందుకు వెళ్ళిందా అంటుండగా, పాప రానే వచ్చింది. తల్లిపక్కగా కూర్చుని, మమ్మీ! ఆ రోజున కన్పించినాయన,యీయనేగా! నాకేమవుతారో చెప్పనా 'అంకులా' అంటోంది హుషారుగా.

కాదమ్మా! నే చెబుతా యిలారా. పాపకోసం ఆప్యాయంగా చేతులు చాచాను. సోఫాలోంచి ఉరికి దగ్గరకు రాబోయింది. కాని శ్రీలత పాప రెక్కపట్టి ముందుకు రాకుండా ఆపి, పాపా నువ్వు బైటకుపోయి ఆడుకోమని పంపేసింది. ఊఁ ... యిప్పుడు చెప్పు, పాపకు నువ్వేమవుతావని చెప్పాలనుకున్నావు, కోపంతో యెర్రబడిన ముఖం: అదురుతున్న పెదవులను కదిలిస్తూ అడిగింది. ఉన్నమాటే,పీకు నేను నాన్ననమ్మా అని. అని నువ్వు అనుకుంటున్నావా, సూటిగా చూసింది. అనుకోవడమేమిటి, అచ్చుగుద్దినట్లు పాప ముఖంలో నా పోలికలు కనుపిస్తుంటే. ఏమీకాదు. నువ్వేకాదంటే, కాకుండా పోదు. పాపమీద ప్రమాణం చేసిచెప్పు.కాదని నమ్ముతానుఅన్నాను. రామూ! ఆడపులిలా గర్జించింది శ్రీలత. ఉన్న మాటంటే ఉలుకెందుకూ అన్నాను హేళనగా నవ్వుతూ. ధృతిమించిరాగాన పడుతున్నావు రామూ! వెళ్ళు, వెంటనే బైటకు వెళ్లు. ఆజ్ఞాపిస్తున్నట్లు చెయ్యిగుమ్మంకేసి చూపింది.వెళతాను. కాని, పాపను ఒక్కసారి దగ్గరకు తీసుకుని, యివియిచ్చికాని వెళ్ళను. నువ్విచ్చే యీ పేద కానుకలు, అందుకునే ఖర్మ పాపకు పట్టలేదు. దానికి పెట్టెలనిండా కావల్సినన్ని బొమ్మలు, చాక్లెట్లు వున్నాయి. యీ ముష్టికానుకలు పీవే తీసుకెళ్ళు అంది సోఫాలోంచి లేచి విసురుగా, టేబుల్ మీదవున్న వస్తువులు కింద పడవేసి.

శ్రీలత చర్యలు నాలో కోపాన్ని రేకెత్తించక పోగా, నవ్వు తెప్పించింది. నవ్వుతా వెందుకు? సిగ్గులేదూ అంది. సిగ్గా, నేనెందుకు సిగ్గుపడాలి? యీ బీదవాడి ద్వారా జన్మించిన ఆ పాప, పీకు గొప్పదైంది:పాపకు నేనిచ్చేకానుకలుబీదవైనాయి. అడుగువేసేముందు, మాట జారేముందు దాని అర్థాన్ని తెలుసుకుని మరీ వాడాలి. యింతకూ...

# తెలుసుకోదగ్గ విషయాలు

—టి. చంద్రశేఖరరెడ్డి

40. నిత్య జీవితంలో ఉపయోగకారి అయిన "గోడగడియారమును తయారుచేసినది" హైజెన్స్ అనే ఆయన.

41. మనం తొడుక్కునే బట్టలనుకుట్టే "కుట్టుమిషన్‌ను తయారు చేసినది" హౌవ్ అనే ఆయన.

42. "విద్యుచ్ఛక్తి"ని ఉత్పత్తిచేసే "డైనమోను" తయారుచేసింది ఫారడే అనే అయన.

43. "ఎలక్ట్రిక్ బల్బు"ను "గ్రామఫోను"ను కనిపెట్టింది ఎడిసన్.

44. "టైప్‌రైటర్‌ను తయారుచేసింది" షోల్స్ అనే ఆయన.

45. మనం ప్రయాణంచేసే "రైలు"ను నడిపించే "రైలుఇంజను"ను తయారుచేసింది స్టీవెన్‌సన్ అనే ఆయన.

46. గ్రహాలలో ఒకటయిన "వరుణగ్రహం" యొక్క ఉనికిని కనిపెట్టింది విలియమ్ హెర్స్‌కెల్" అనే ఆయన.

47. "ఎలక్ట్రిక్ బ్యాటరీ"లను తయారుచేసింది వోల్టా అనే ఆయన.

48. భారతదేశంలో అన్నిటికన్నా అత్యుత్తమమయిన "భారతరత్న" అవార్డును ఇంతవరకు పదిహేనుమంది పొందిన వారు.

1) చక్రవర్తుల రాజగోపాలాచారి, 2) డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, 4) డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, 4) డాక్టర్ సి. వి. రామన్, 5) డాక్టర్ డి. కె. కార్వే, 6) జవహర్‌లాల్ నెహ్రూ, 7) లాల్‌బహదూర్ శాస్త్రి, 8) డాక్టర్ బి. సి. రాయ్, 9) పురుషోత్తమదాస్ టాండన్, 10) గోవింద వల్లభ్‌పంత్, 11) భగవాన్‌దాస్, 12) యమ్. విశ్వేశ్వరయ్య 13) డాక్టర్ సి. వి. కానే, 14) డాక్టర్ జాకిర్‌హుస్సేన్, 15) శ్రీమతి ఇందిరాగాంధీ.

49. డాక్టర్లు ఉపయోగించే "స్టెతస్కోప్"ను తయారుచేసింది లైనెగ్ అనే ఆయన.

50. "థర్మామీటరు"ను కనిపెట్టింది ఫారన్‌హీట్ అనే ఆయన.

# శ్రమ చేయని వాడు సంఘ శత్రువు...

శ్రమపడు, సంఘముకొరకై
శ్రమపడు నీ సుఖము కొరకు - సంఘము ఎపుడున్
శ్రమపడు లే సౌఖ్యంబగు
శ్రమమించిన శక్తి వేరె - జగతిని గలదా?

శ్రమచేయ కనుభవించకు
శ్రమ దోపిడిచేయబోకు - సంఘమునందున్
శ్రమచే శక్తి పరుండగు
శ్రమ చేయనివాడు సంఘ - శత్రువుగాదే?

శ్రమయే జీవనభాగ్యము
శ్రమయే దేశప్రగతియు - సౌభాగ్యంబున్
శ్రమయే నీతియు యోగ్యము
శ్రమయే మార్గంబు రక్ష - జగతికి యెపుడున్

శ్రమచేసిన ఆరోగ్యము
శ్రమచేసిన పాడిపంట - రయమున పెరుగున్
శ్రమచేసిన, ధనవృద్ధియు
శ్రమచేసిన దేశశక్తి శక్తిగయుండున్

శ్రమమూలమె, విజ్ఞానము
శ్రమమూలమె నవసమాఖ్య -సాధించుటకున్
శ్రమమూలమె ఘనవిజయము
శ్రమమూలమె నవ్యదివ్య - సౌధములైనన్

శ్రమయే మిత్రుల గూర్చును
శ్రమయే ఘన నవసమాజ - రక్షణగూర్చున్
శ్రమయే శత్రుల గూల్చును
శ్రమయే మన సమగ్రదేశ - సఖ్యతచేయున్

శ్రమవిలువయె ధనమైనను
శ్రమచేసెడి వారివద్ద - సంపదయేదీ?
శ్రమచేయని వారెందరొ
శ్రమజీవుల దోచ ఎట్లు - సంపదయుండున్?

శ్రమ విలువను చెల్లించక
శ్రమజీవుల శక్తిదోచు - సంపన్నులతో
శ్రమతో క్రమశిక్షితులై
శ్రమఫలితము పొందవలెను - శ్రామికులెల్లన్.

— వడ్డెపాటి లక్ష్మణాచార్యులు

---

యేమంటావు? ఆ పసిదాన్ని మాలిమి చేసుకుని ఉన్నవీలేనివీ చెప్పిదాని మనస్సుని నావైపుకు తిప్పుకోవాలని చూస్తున్నావేమో. నీ జీవిత మంతా ధారపోసినా నీకసాధ్యమది అంది. సాధ్యమయ్యేవి గొప్పవాళ్ళకే అంటావు. డబ్బు దురద తప్పుకున్న మీరే మమ్మల్ని యిలా అనామకులలా ఆడిస్తున్నారు. మీలాగ మేము మాయలు చెయ్యలేము, మంత్రాలు వెయ్యలేము, అబద్ధాలాడలేము, అడ్డంగా సంపాదించలేము. నిజాన్ని నిక్కచ్చిగా పాపకు చెప్పి, పాప గుండెల్లో చిన్న స్థావరాన్నేర్పరచుకుందామని వచ్చాను, అన్నాను నేనే పాపను పిలుద్దామని లేస్తూ పాప...పాప... యెవరికి పాప? నవమాసాలు మోసి కనిపెంచుతున్న దాని తల్లిని నేను. నా అనుమతి లేకుండా, పిల్లను తాకే అర్హత కూడా నీకు లేదు, ఐనా చుట్టమని చూడవచ్చి దయ్యమై పట్టుకున్నట్లు... యీ పట్టుదలతో యిలాగే కానీపు వున్నావంటే, నౌకరుచేత బైటకు గెంటించవలసివుంటుంది. అంతేకాదు మా వారితో చెప్పి నీ వుద్యోగం వూడలాగిస్తాను. శ్రీలత ప్రయోగించిన ఆఖరి అస్త్రం, తగిలి నా నవనాడులనూ కృంగదీసింది. అంతపనీ చేయిస్తుందేమోనని భయంతో. నాలుక పిడచకట్టుకుపోయి. ముచ్చెమటలతో ముఖం ముద్దయినది.

వద్దు శ్రీలతా! పిచ్చుకమీద బ్రహ్మాస్త్రంలా అంతపని మాత్రం చేయించకు మీ నాన్న ధర్మమాయని, యిదివరకొకసారి అనుభవమైనది. తిరిగి ఉద్యోగం సంపాదించుకుందుకు, యీపట్నంవచ్చి యెన్ని పట్టరాని కాళ్ళుపట్టానో యెన్నెన్ని 'గల్లీలు, తిరిగానో, మరెంతమంది దగ్గరనో నాగోడు విన్నవించుకున్నానో. నానోటికితెలుసు.... యెండనక, వాననక చెప్పు లేనా లేకుండా తిరిగిన నా కాళ్ళకు తెలుసు. నిప్పులు చెరిగే యెండలో అడుగుతీసి అడుగు వేచేసరికి, అరంగుళం దళసరం బొబ్బలెక్కేవి. ఆ మచ్చలు కూడా యింకా మాసిపోలేదు. మళ్ళీ ఉద్యోగం పోతే యింక, కట్టగట్టుకుని ముగ్గురం మూసీ నదిలో మునగవలసిందే తప్ప మరి మార్గం లేదు. అభిమానాన్ని చంపుకుని నా ఆవేదనను శ్రీలతముందు వ్యక్తం చేసుకోవడం నాకు సుతరామూ యిష్టం లేదు. కాని నిరుద్యోగంలో నా కుటుంబం యెన్ని పూటలు పస్తు వుందో, యెన్ని యిక్కట్లకు గురి అయ్యానో, మాటలతో వర్ణించ లేను. అది గుర్తు వచ్చే నా నిస్సహాయతను నే వెళ్ళగ్రక్కుకున్నాను. కలవాళ్ళ కర్కశమైన పాదాలక్రింద నలిగిపోయే మట్టి బెల్లులవంటి మాబోటి వారికి పౌరుషం వున్నా చెల్లదనీ, రెండవ సారికూడా అనుభవంలోకి రాబోతుంటే యింకా మమతలు, మమకారాలు అంటూ, అలాగే వుంటే కాదు పొమ్మన్నా కాళ్ళు పట్టుకు వెళ్ళాడినట్లుంటుందని, వెంటనే గుమ్మం దాటేను. ముష్టి పరుకులు, యిక్కడే వదిలి పోతున్నావని వెనకనుండి శ్రీలత గొనుగుడు వినబడింది. కష్టపడి సంపాదించిన డబ్బుతో కొన్నవేగాని, ముష్టివికావని, కలవాళ్ళు కళ్ళుతెరిచి గుర్తించేరోజు, కలియుగాంతానికైనా కలుగుతుందో. లేదో, చూడాలి మరి. యీ మట్టి బెల్లులు, యే బూటుకాలి క్రిందా పడి నలగకుండా బ్రతికి బట్ట కట్టిననాడు ... అనుకుంటూ ముందుకు సాగిపోయాను.

*